క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బులు వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ఫ్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

గాజుల అలంకారంలో వాసవీ మాత



పులివెందుల టౌన్ : అధిక శ్రావణ మాస రెండవ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీమాతను ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలిల ఆధ్వర్యంలో గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

వేంపల్లె : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ సదస్సుకు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు హాజరై విద్యార్థులకు పులుల సంరక్షణ, పులుల విశిష్టత గురించి తెలియజేస్తారన్నారు.

ముద్దనూరులో రైళ్ళు ఆపాలని వినతి

ముద్దనూరు : కరోనా సమయంలో ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో నిలపని పలు రైళ్ళను ఆపాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు షామీర్‌బాషా గుంతకల్లు రైల్వే డివిజనల్ సమీక్షా సమావేశంలో డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌తో చర్చించి వినతిపత్రం అందించారు. ధర్మవరం-మచిలీపట్నం, చైన్నె-ముంబయి, కన్యాకుమారి-పూణె (16381-16382)రైళ్ళను ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో ఆపాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

కొండాపురంలో..

కొండాపురం : స్థానిక రైల్వేస్టేషన్‌లో చెన్నై నుంచి ముంబాయి వయా కొండాపురం (22159, 22160) కన్యాకుమారి నుంచి పూణే వయా కొండాపురం (16381, 16382) మీద వెళ్లే రైళ్లు ఆపాలని గుంతకల్ డివిజనల్ డీఆర్ఎం మనీష్ ఆగర్వాల్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు శుక్రవారం రైల్వే డీఆర్‌యూసీసీ బోర్డుమెంబర్ వై.షామీర్‌బాషా తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక 15వ కౌన్సిల్ వార్డు పరిధిలోని పడమట వీధి, రామ్‌నగర్‌లలో శనివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కమలాపురం : పట్టణంలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం శని, ఆదివారం రోజుల్లో పని చేస్తుందని వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా వినియోగదారులు తమ బిల్లులను ఈ రెండు రోజుల్లో చెల్లించుకోవచ్చని ఆయన తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ చార్జీల వసూళ్ల కేంద్రాల కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఏఈ రాజు తెలిపారు. ప్రభుత్వ సెలవు, ఆదివారాలలో కూడా విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు కట్టవచ్చునన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని వేంపల్లి రోడ్డులో ఉన్న ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలో ఉన్న ఈఆర్‌ఓ ఆఫీసులో సెలవు రోజుల్లో కూడా కరెంటు బిల్లులు చెల్లించవచ్చునని విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



వేముల ఎస్సీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వేములలోని ఎస్సీ కాలనీలో పాడా నిధులతో నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డితో కలసి ప్రారంభించి మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి పాడా నిధులతో వాటర్ ప్లాంట్లు నెలకొల్పి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జనాభా ప్రాతిపదికన ఎన్ని లీటర్లు అవసరమవుతాయో అంత సామర్థ్యంతో వాటర్ ప్లాంట్లను నిర్మి స్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటనారాయణ, చలపతి, రాఘవరెడ్డి, వెంకట శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు మండి మా పీరా, గౌస్ పీరా, నాగభూషణం, గంగులయ్య, పి.వి.రమణ, మున్నీర్, సూర్యుడు పాల్గొన్నారు.

నూతన చర్చిని ప్రారంభించిన ఎంపీ

వేముల బస్టాండు వద్ద పాడా నిధులతో నూతనంగా నిర్మించిన తెలుగు కౌన్సిల్ చర్చిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూనే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇప్పటికే 98 శాతం హామీలను అమలు చేశారన్నారు. అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండకూడదనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దళితవాడలోని వంద కుటుంబాలకు కృపానగర్ సమీపంలో ఇళ్ల స్థలాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కృపానగర్ వద్ద కాలనీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. చర్చి కాలనీలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ రాష్ట్ర డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జర్మియా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 10 కుటుంబాలు చేరిక

వేములలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడిల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వేములకు చెందిన కొప్పల చిన్న కుళ్లాయప్ప, రాజ కుళ్లాయప్ప, చంద్రశేఖర్, మహేష్‌చంద్ర, బాలకుళ్లాయప్ప, ఎర్రగోర్ల గంగిరెడ్డి, దేవభూషణం, జయరాజు, ఇషాక్, ఓబులేసులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన పాలనలో పేదలకు న్యాయం జరుగుతుండటంతో పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

పులివెందుల రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులోని ఫిష్ ఆంధ్ర సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రాంగణాన్ని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలసి ప్రారంభించారు. క్రికెట్ ప్రాక్టీస్ కోర్టు, ఫుట్‌బాల్ కోర్టు, స్నూకర్స్ కోర్టు, టేబుల్ టెన్నిస్ కోర్టులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, మహమ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీఅవధూత నారాయణ స్వామి ఆరాధన



బ్రాహ్మణపల్లె గ్రామంలోని శ్రీఅవధూత నారాయణస్వామి ఆలయం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో 30వ తేదీ ఆదివారం శ్రీఅవధూత నారాయణస్వామి 23వ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఉదయం అవధూత నారాయణస్వామి సమాధి వద్ద ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాలు అందిస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 6 గంటల నుంచి 9.30 గంటలకు బ్రాహ్మణపల్లె భజన బృందం వారిచే చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము వరకు డాక్టర్ ఎస్.నాగేశ్వర బృందం వారిచే శ్రీసాసవల చిన్నమ్మ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని నారాయణస్వామి అనుగ్రహం పొందాలని వారు కోరారు.

తల్లి, శిశు సంరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న డాక్టర్ జి.సుప్రిత

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్య ఆరోగ్య సిబ్బంది తల్లి, శిశు సంరక్షణకు పాటు పడాలని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.సుప్రిత తెలిపారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో శివయ్య ప్రోగ్రామ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులకు తల్లి, శిశు సంరక్షణ గురించి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ఏఎన్ఎంలకు తల్లి బిడ్డ సంరక్షణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డను ప్రసవించే వరకు ప్రతి నెల రక్త పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. తల్లి ప్రసవించిన తర్వాత బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లి పాలే బిడ్డ తీసుకునే విధంగా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే శిశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. స్టాఫ్ నర్సులంతా తప్పని సరిగా ఏఎన్ఎంలను పర్యవేక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభం కానుందని, రోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు తాజుద్దీన్ బాషా, సునీల్ కుమార్, శిల్ప, కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



భాకరాపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఇస్లాంపురంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్-2023లో ర్యాంక్ సాధించేందుకు చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పురపాలక ప్రజలు ప్రజలను చైతన్యపరిచి సిటిజెన్ పీడ్ బ్యాంక్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో కొనసాగుతున్న నిరసనలు



ఆర్టీపీపీలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) పవర్ హౌస్ గేటు వద్ద ఆర్టీపీపీ జేపీసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న ధర్నా శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేపీసీ నాయకులు మాట్లాడుతూ 2022 వేతన సవరణ, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో జేపీసీ నాయకులు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుందాం



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పులివెందుల రూరల్ : డిమాండ్ల సాధన కోసం ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుందామని 327 విద్యుత్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, యూనియన్ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద రెండవ రోజు విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. 2022కు రావాల్సిన పీఆర్సీ ఇవ్వకుండా నెలలో ఆలస్యం చేశారన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే 1999 నుంచి 2004 వరకు నియమితులైన వారికి పెన్షన్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ వర్కర్లను జేఎల్ఎం గ్రేడ్-2 వారిని రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ హరి సేవియా నాయక్, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



సీతోరుపల్లెలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి



నేలతిమ్మాయపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ప్రధాన ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలోని పైడికాలువ ఎస్సీ కాలనీ, జంగంపల్లె, సీతోరుపల్లెల్లో శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్ సీపీ నేతలు ఓబీ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, సర్పంచ్ చెన్నమ్మ, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవో పీఆర్‌డీ ప్రసాద్, ఏవో సాయిజ్యోతి, ఏపీఎం శైలజ, ఏపీవో పార్థసారథి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

వీరపునాయునిపల్లె : ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన తీసుకురావాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.పాలగిరి పంచాయతీలోని నేలతిమ్మాయపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, మినరల్ వాటర్ ప్లాంటులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సకాలంలో సేవలు అందించాలన్న సంకల్పంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ప్రతి చిన్న సమస్యను పరిష్కరించుకోవాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం అలా కాకుండా గ్రామంలోనే ఉంటూ తమ పనులు చేసుకుంటూ ఖాళీగా ఉన్న సమయంలో సచివాలయానికి వెళ్లి సమస్యలను పరిష్కరించుకొనే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనపై దేశంలోని అన్ని రాష్ట్రాలు దృష్టి పెట్టాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి, ఏపీపీఎస్సీ బోర్డు మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచులు విజయ్‌రాముడు, సురేంద్రకుమార్, ఎంపీటీసీలు రాఘవయాదవ్, వీరభద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, గంగాధర, మాజీ ఎంపీపీలు వీరయ్యయాదవ్, గోవిందురెడ్డి, కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు, ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకటసుబ్బయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని చీమలపెంట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో పూర్తిస్థాయిలో ప్రజలందరికీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రామ స్థాయిలోనే సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పని చేస్తున్నారన్నారు. అనంతరం గత కొన్ని సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్న మిన్నయ్యగారిపల్లె గ్రామ ప్రజల సౌకర్యార్థం గ్రామానికి వెళ్లె దారిలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, గౌరిశంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, గంగిరెడ్డి, బ్రహ్మంరెడ్డి, గురప్ప, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఏఈ సుబ్బయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఎర్రగుంట్ల : పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ హరిప్రసాద్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎఫ్ఎస్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళను నిర్వహిస్తున్నారని, వయస్సు 18-30 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డులో జరిగే ఇంటర్వ్యూకు ఆధార్ కార్డుతో పాటు బ్యాంక్ పాసు బుక్, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు తీసుకురావలేనని వారు తెలిపారు. ఇతర వివరాలకు 8985093660, 9347496510 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ముద్దాయి ఆచూకీ తెలపండి

ఎర్రగుంట్ల : మండలంలోని రంగసాయిపురం గ్రామానికి చెందిన కేతు మునికుమార్‌రెడ్డి(31) పలు కేసులలో ముద్దాయిగా ఉన్నాడని ఇతని ఆచూకీ తెలిస్తే ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ ఆర్ ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతను పలు కేసులలో కమలాపురం కోర్టుకు హాజరు కమ్మని పలుమార్లు కోర్టు ఆదేశాలు జారీ చేసినా హాజరుకాలేదన్నారు. ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



టీటీడీ ఈఓ ధర్మారెడ్డితో మాట్లాడుతున్న గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి

చక్రాయపేట : శ్రీ గండి వీరాంజనేయస్వామి క్షేత్రంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీవరకు జరిగే శ్రావణ మాసం ఉత్సవాలకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని శుక్రవారం టీటీడీ ఈఓ ధర్మారెడ్డిని గండిక్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి కలిసి కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు టీటీడీ దేవస్థాన ఖర్చుతో షెడ్లు, స్టేజీ, మొబైల్ టాయిలెట్స్, 70 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వస్తారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ ఉత్సవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. స్పందించిన టీటీడీ ఈఓ సంబంధిత అధికారులను పిలిపించి సత్వర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారని గండి క్షేత్ర అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతలు శిక్షణలో నైపుణ్యాన్ని పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూక్ష్మ పరిశ్రమల శాఖ అడిషనల్ డైరక్టర్ కుమార్

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : చేనేత కార్మికులు కొత్త తరహాలో శిక్షణ పొంది నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలని కేంద్రప్రభుత్వ సూక్ష్మ పరిశ్రమల శాఖకు చెందిన అడిషనల్ డైరక్టర్ ఎస్.ఎస్.కుమార్ తెలిపారు. శుక్రవారం మైలవరం మండలంలోని చేనేత గ్రామాలైన వేపరాల, దొమ్మరనంద్యాల గ్రామాల్లో చేనేత కార్మికులు, స్వయం సహాయ సంఘాల మహిళ సభ్యులతో వారు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మైలవరంలో ఉన్న టెక్స్‌టైల్ పార్కులో హ్యాండ్లూమ్ తయారీలో కార్మికులకు శిక్షణ ఇప్పించి వారు తయారు చేసిన వస్తువును ఇక్కడి నుంచే విక్రయించుకునే అవకాశం కల్పించామన్నారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన వారందరికి నేతన్న నేస్తం కింద రూ.24 వేలు వచ్చాయ లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండలంలో దాదాపు 1975 మందికి ఈ పథకం కింద డబ్బులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి



వేంపల్లె : చీనీలో సాగు చేసిన అంతర పంటను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణంరాజు



వీఎన్‌పల్లె : వేరు శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వేంపల్లె : రైతులందరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం పొలంబడి ప్లాట్ విజిట్‌లో భాగంగా మండలంలోని అయ్యవారిపల్లెలో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించి అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రైతులు పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా చూడాలని సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన పంటలకు అనుగుణంగా 5 రకాల అంతర పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రధాన పంటకు అయ్యే ఖర్చు అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుందన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గ్రామంలో పొలాల విస్తీర్ణం, రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ వసంతకుమారి, ఎస్ఎఫ్ఏ నరసింహారెడ్డి, మండల ఇన్‌చార్జి శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీవాణి, ఐసీఆర్పీఎస్ గంగామహేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

చెన్నూరు : మండలంలోని కొండపేట, చెన్నూరులలోని వరి, చీని, నిమ్మ పంటలను శుక్రవారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్.రామలక్ష్మిదేవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానసలు పరిశీలించారు. వరిలో ప్రస్తుతం కొన్ని చోట్ల నాట్లు జరుగుతున్నాయని, మరి కొన్ని చోట్ల నాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. రైతులు వరి నాట్లు నాటేటప్పుడు ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ కాలి బాటలు తీసుకోవాలన్నారు. జింకు లోప లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ అలాగే 5 గ్రాముల యూరియా చొప్పున కలిపి 5 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. చీని నిమ్మలో సూక్ష్మ ధాతు లోపాలు ముఖ్యంగా జింకు, మెగ్నీషియం, ఇనుము ధాతు లోపాలు ఉన్నట్లైతే సూక్ష్మ పోషకాల మిశ్రమం 10 గ్రాములు ఒక లీటరుకు కలిపి పిచికారి చేయాలన్నారు. రసం పీల్చు పురుగులు ఆశించిన మొక్కలకు వేప నూనె 3 మి.లీ మరియు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఆర్.బి.కె. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడి

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టడంతో అధిక దిగుబడి వస్తాయని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారి శ్యామ్‌బాబుతో కలిసి ఆయన మండలంలోని గొనుమాకులపల్లెలో సాగుచేసిన వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలో ఉందని ఎకరాకు 200 కేజీలు జిప్సమ్ వేయడం వలన మంచి దిగుబడి సాధించడంతో పాటు నూనె శాతం పెరుగుతుందని తెలిపారు. పచ్చదోమ, పేను బంక, రసపీల్చే పరుగు ఉధృతి ఎక్కువగా ఉందని నివారణ కొరకు డైమిథోయేట్ 2.0 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పంట సాగు చేయు సమయంలో 150 కేజీలు సింగల్ సూపర్ పాస్ఫేట్ వేసుకోవాలన్నారు. సర్పంచు సురేంద్రకుమార్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

పందులను తరలించకపోతే చర్యలు

చెన్నూరు : గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పందులను యజమానులు గ్రామాలకు దూరంగా తరలించకపోతే కఠిన చర్యలు తప్పవని సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ ముదిరెడ్డి సుబ్బారెడ్డిలు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారి వారిని హెచ్చరించారు. పందుల యజమానులు గ్రామాలలో పందులను విచ్చలవిడిగా వదలడంతో ప్రజలు అనేక సార్లు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, ఇటు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారు పందులను ఊరి మీదికి వదులుతుండటంతో కొద్దరోజుల్లో లారీని పిలిపించి పందులను వేరే ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ లోపు గ్రామాలలో పందులు కనిపిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచె ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : పట్టణంలోని ప్రధాన కూడలిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని బీజేపీ దళిత మోర్చా నాయకుడు మేకల ఆంజనేయులు ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సంజామలమోటు, బాలికల హైస్కూల్, పెద్దపసుపల మోటు, కూరగాయాల మార్కెట్ తదితర రద్దీగా ఉండే ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచె లేకపోవడంతో వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.